క్లుప్తంగా

'యూరియా కొరతతో ఇబ్బందులు'


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

దహెగాం: ఖరీఫ్ సీజన్‌లో పంటలకు సరిపడా యూరియా సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు దందెర మల్లేష్ అన్నారు. సోమవారం సహకార సంఘం కార్యాలయంలో యూరియా పంపిణీని పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. రైతులకు సరిపడా యూరియా అందడం లేదని వాపోయారు. యూరియా కొరత సృష్టిస్తే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మి, బాపు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'మందకృష్ణ పర్యటన జయప్రదం చేయండి'


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దహెగాం: ఈనెల 26న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ కాగజ్‌నగర్ పట్టణానికి వస్తున్నందున ఆయన పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి శ్రీశైలం అన్నారు. సోమవారం మండలంలోని మొట్లగూడ గ్రామాన్ని సందర్శించారు. నాయకులు బాపు, అంకులు, నారాయణ, మల్లేష్, దుర్గయ్య పాల్గొన్నారు.

భారీ వర్షం.. రైతుల హర్షం


దహెగాంలో కురుస్తున్న వర్షం

దహెగాం: గత పది రోజుల నుంచి మండలంలో వర్షాలు జాడ లేకపోవడంతో రైతులు వర్షం కోసం అల్లాడుతున్న క్రమంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం పత్తికి జీవం పోసిందని రైతులు పేర్కొంటున్నారు. వరి నాట్లకు సైతం వర్షం ఊరటనిచ్చిందని తెలిపారు. మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో వర్షపు నీరు నిలిచి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అంబులెన్స్‌లో ప్రసవం


శిశువుతో సిబ్బంది

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన కుర్సింగె మధునక్క అనే గర్భిణీ సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో అచ్చెల్లి గ్రామ సమీపంలో నొప్పులు అధికం కావడంతో 108 అంబులెన్స్ సిబ్బంది ప్రసవం చేశారు. ఈఎంటీ పిట్టల విజయ్, పైలెట్ సుభాష్ ఉన్నారు.

'నిబంధనల ప్రకారమే నిధుల ఖర్చు'


మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ తుకారాం

వాంకిడి: గ్రామ పంచాయతీ నిధులను నిబంధనల ప్రకారమే ఖర్చు చేశామని వాంకిడి మాజీ సర్పంచ్ బండె తుకారాం అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీపీ నిధులు గోల్‌మాల్ జరిగిందంటూ వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. గ్రామాభివృద్ధికి వచ్చిన నిధులు దుర్వినియోగం కాలేదన్నారు. ప్రతీ పనిని ఇంజనీరింగ్ అధికారుల ద్వారా ఎంబీ రికార్డు చేయించామని తెలిపారు. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో అప్పులు తీసుకొచ్చి నిధులు మంజూరయ్యాక వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. బినామీలు పెట్టుకున్నారనే వార్తలో వాస్తవం లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ పవన్ సాయి, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎంగలి రాకేశ్, అశుతోష్ పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

- స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేత
- నిర్మానుష్యంగా రహదారులు
- మద్దతు తెలిపిన పలు రాజకీయ పార్టీలు

కెరమెరి: ఆదివాసీల మనుగడకు విఘాతం కలిగించేలా ఉన్న జీవో నం.49 రద్దు చేయాలని కోరుతూ తుడుందెబ్బ ఇచ్చిన జిల్లా బంద్ సోమవారం మండలంలో విజయవంతమైంది. కిరాణా, టీ, బట్టలు, హార్డ్‌వేర్ తదితర దుకాణాలను తెరవలేదు. తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ ఆదివాసీలను అడవుల నుంచి తరిమివేసే కుట్ర జరుగుతుందని, అటవీ అధికారులు మాత్రం గిరిజన ప్రాంతాలకు నష్టం జరగదంటూ నమ్మకద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. సోము, బాదిరావు, సాగర్, వనస్పతి, వసంత్‌రావు తదితరులు ఉన్నారు.

చింతలమానెపల్లి: జీవో నం.49 రద్దు చేయాలని ఆదివాసీ సంఘాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తలపెట్టిన బంద్ మండలంలో విజయవంతమైంది. మండల కేంద్రంతో పాటు రవీంద్రనగర్, డబ్బా, గూడెం గ్రామాలలో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులకు భంగం కలిగించే జీవో 49ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌కు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.

పెంచికల్‌పేట్: టైగర్ కన్జర్వేషన్ కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 49 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా మూసివేశారు. జీవో రద్దు చేయాలని పెంచికల్‌పేట్ –సలుగుపల్లి రహదారిపై ఆదివాసీలు రాస్తారోకో చేశారు. బంద్‌కు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలతో యువకులు మద్దతు తెలిపారు. బంద్ నేపథ్యంలో ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. కాగజ్‌నగర్ మండల బీజేపీ అధ్యక్షుడు పుల్ల అశోక్ ఆధ్వర్యంలో దుకాణాలు మూసి వేయించారు. ఈస్‌గాం మార్కెట్‌లో దుకాణాలు బంద్‌పాటించి సంపూర్ణ మద్దతు తెలిపారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి బాపురావు, మాజీ మండల అధ్యక్షుడు రణవీర్ బిస్వాస్, ఈశ్వర్‌దాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాళిదాస్ ముజుందర్ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: జీవో 49 రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మండల బంద్ పాటించారు. ఆదివాసీ నాయకుడు ఆత్రం అనిల్‌కుమార్, పుర్కా మనీష్, గణపతి, బాదిపటేల్, రమేశ్, గణేశ్, బాపురావ్, చదస్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో సోమవారం ఆదివాసీల పిలుపుమేరకు జీవో నం.49ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా బంద్ పిలుపునివ్వగా బంద్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలోని వ్యాపార సముదాయాలతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించి ఆదివాసీలకు మద్దతు తెలిపారు.


కెరమెరి: మూసి ఉన్న దుకాణాలు


చింతలమానెపల్లి: బంద్ చేయిస్తున్న నాయకులు


కెరమెరి: నిర్మానుష్యంగా మండల కేంద్రం


కాగజ్‌నగర్‌రూరల్: ఈస్‌గాంలో దుకాణాలు బంద్ చేస్తున్న బీజేపీ నాయకులు


లింగాపూర్: నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు


పెంచికల్‌పేట్: సలుగుపల్లి రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ నాయకులు

జాబ్‌మేళా కరపత్రాలు విడుదల


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: ఉట్నూర్‌లోని పెర్కగూడ జేఎస్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 25న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ తలపెట్టిన జాబ్‌మేళా కరపత్రాలను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విడుదల చేశారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ శ్యాం మాట్లాడుతూ జాబ్‌మేళాలో 50కి పైగా కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు మసాదే చరణ్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, గంగారాం, ఆత్రం లింగు, కోరెంగ జుగాదిరావు, జాలింషా తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌గోండ్ సేవా సమితి కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కెరమెరి: మండల కేంద్రంలోని హట్టి బేస్ క్యాంపులో సోమవారం రాయిసెంటర్ రాజ్‌గోండ్ సేవా సమితి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి శ్రీనివాస్, రాజ్‌గోండ్ సేవాసమితి రాష్ట్ర కార్యదర్శి పెందోర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమిటీలో మండలాధ్యక్షుడిగా పెందోర్ మోతిరాం, ఉపాధ్యక్షులుగా కుడుమెత జాలీంశావ్, ఆత్రం రాము, ప్రధాన కార్యదర్శిగా ఆత్రం తుకారాం, కార్యదర్శిగా సిడాం ధర్ము, కోశాధికారులుగా ఆత్రం లింబారావు, ఆత్రం సురేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో తన వంతు కృషి చేస్తానని మోతిరాం తెలిపారు.

జిల్లాకేంద్రంలో గోశాల నిర్మించాలి


రోడ్డు ప్రమాదంలో గాయపడిన లేగదూడ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో గోశాల నిర్మించాలని భజరంగ్ దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక చెక్‌పోస్టు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని లేగదూడ గాయాలపాలైంది. గాయపడిన లేగదూడకు భజరంగ్ దళ్ సభ్యులు చికిత్స చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో గోశాల లేకపోవడంతో పట్టణంలోని గోవులు, లేగదూడలు రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మూగ జీవాలను రక్షించేందుకు గోశాల ఏర్పాటు చేయాలని భజరంగ్ దళ్ సభ్యులు రవి, శివ, జైస్వాల్ కోరారు.

ఆవును రక్షించిన గో ప్రేమికులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో విష పదార్థాలు తిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆవును సోమవారం గోప్రేమికులు రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. ఆవు నోటి నుంచి నురుగులు రావడంతో గమనించిన స్థానికులు పసునూరి తిరుపతి, సాయి, వెంకటయ్యలు వెంటనే పశువుల వైద్యున్ని పిలిపించి చికిత్స చేయించారు. దీంతో ఆవు నెమ్మదిగా కోలుకొని ప్రాణాపాయ స్థితినుంచి బయటపడింది. ఆవు ప్రాణాలను కాపాడిన వారిని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

సమయానికి రారెందుకో..!


మందుల కోసం వేచి ఉన్న రోగులు

- అందుబాటులో లేని వైద్యులు
- అవస్థలు పడుతున్న రోగులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం 'సాక్షి' ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించగా సూపరింటెండెంట్‌తో పాటు ఏ ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో లేరు. ప్రతీరోజు ఆసుపత్రికి వందలాది మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది మందులు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. ఆసుపత్రిలో డాక్టర్లు లేకపోవడంతో స్థానికులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సూపరింటెండెంట్ పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిని నిర్వహిస్తుండడంతో ఎక్కువగా అక్కడే ఉంటున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ విషయమై సూపరింటెండెంట్ చెన్న కేశవ్‌రావును ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.


ఖాళీగా వైద్యుడి కుర్చీ

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

వాంకిడి: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 23న నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, విద్యాధికారుల పోస్టులు భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో విద్యాసంస్థల బంద్ చేపట్టినట్లు తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు బంద్‌కు సహకరించాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు షేక్ సమీర్, అయ్యూబ్ ఖాన్, సాయినాథ్, వినేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగజంపుల తిరుపతి

ఆలయాలకు వెళ్లేదెలా..?

- భక్తులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలకు వెళ్లే రహదారులు మురుగు కాలవలతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో ఆలయాలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని పెద్దవాగు సమీపంలోని శ్రీ బాలేశ్వర స్వామి ఆలయంతో పాటు, పోచమ్మ ఆలయం, అయ్యప్ప ఆలయాలకు వెళ్లే రహదారులు పూర్తిగా బురదమయంగా మారాయి. పవిత్ర శ్రావణమాసం సందర్భంగా భక్తులు ఆలయాలకు పెద్ద ఎత్తున వెళ్లే అవకాశం ఉన్నందున రహదారులను శుభ్రం చేయాలని కోరుతున్నారు. అయ్యప్ప ఆలయానికి వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. రహదారులకు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో రోడ్లపై మురుగునీరు చేరుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు చొరవ చూపి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


బాలేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారిపై మురుగునీరు

చెట్టు కిందే '108'

- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్న వాహనం
- సిబ్బందికి సైతం తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు


చెట్టు కింద నిలిపి ఉంచిన 108 వాహనం

చింతలమానెపల్లి: అత్యవసర ఆపద వస్తే చాలు అందరికీ గుర్తుకొచ్చేది 108. ప్రాణాపాయ స్థితిలో, ఆరోగ్యపరమైన సమస్య తలెత్తితే అవసరమైన సహాయం అందించేది. కానీ ఈ అంబులెన్స్‌కు మండలంలో వసతి కరువైంది. మండలానికి మంజూరైన వాహనానికి వసతి లేక పోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ సేవలందిస్తోంది. గత జనవరిలో మండలానికి 108 వాహనం మంజూరైంది. మండలంలో 108 వాహనానికి, సిబ్బందికి ఎలాంటి ప్రత్యేక భవనం లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలికంగా రవీంద్రనగర్1 ఉన్నత పాఠశాల గది సమీపంలోని మైదానంలో చెట్లకింద వాహనాన్ని నిలుపుతూ గదిలో నలుగురు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.

విలువైన పరికరాలు..

108 వాహనంలో అత్యవసర చికిత్స అందించడానికి ఖరీదైన మందులు, పరికరాలు ఉంటాయి. వీటితో పాటు అత్యవసర స్థితిలో రోగులను, బాధితులను తరలించడానికి 108 వాహనాన్ని ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఈ వాహనాన్ని ఎక్కువ కాలం మన్నిక రావాలంటే, పరికరాలు చెడిపోకుండా ఉండాలంటే నీడ అందించేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన షెడ్‌లో కాని భవనంలో కాని ఉంచాలి. దీంతో పాటు క్రమం తప్పకుండా వాహనాన్ని శుభ్రం చేయడంతో పాటు సంరక్షించాల్సి ఉంటుంది.

ఇబ్బందుల్లో సిబ్బంది..

108 వాహన సిబ్బందికి ఇతర మండలాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ భవనాలలో గదులు కేటాయించారు. వాహనానికి కూడా ప్రత్యేకంగా భవనం ఉంది. కానీ చింతలమానెపల్లి మండలంలో ప్రత్యేకంగా భవనాలు లేవు. రవీంద్రనగర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉన్నా అందులో గదులు సరిపోవడం లేదు. దీంతో రవీంద్రనగర్1లోని పాఠశాలలో చెట్టు కింద వాహనాన్ని నిలుపుతున్నారు. అక్కడే గదిలో సిబ్బంది ఉంటున్నారు. వారికి నీటి సౌకర్యం, మరుగుదొడ్లు అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులు పడుతూ సేవలందిస్తున్నారు. వాహనాన్ని శుభ్రం చేసుకోవడానికి కూడా నీటి సదుపాయం లేదు. ఎండాకాలంలో చెట్ల నీడన ఉంచినా వర్షాకాలంలో వాహనం తడుస్తోంది. వాహనాన్ని ఉంచే చోట బురదగా మారుతుండడంతో వాహనాన్ని దూరంగా రోడ్డుపైనే ఉంచి సిబ్బంది గదిలో ఉండాల్సి వస్తోంది. ప్రజలకు సేవలందించడానికి పూర్తి స్థాయిలో పని చేస్తున్నా అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారులు స్పందించాలని 108 సిబ్బంది కోరుతున్నారు.

భవనం కేటాయించండి



108 వాహనానికి, సిబ్బందికి వసతులతో కూడిన భవనం కేటాయించాలి. సరైన వసతులు లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. నీటి సౌకర్యం లేకపోవడంతో వాహనాన్ని శుభ్రం చేయంగా కష్టంగా మారింది. నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ వసతి ఉన్న భవనాన్ని కేటాయించాలి. **- మడె శ్రీనివాస్, సిబ్బంది**

వసతులు లేవు..



వాహనాన్ని, అందులో ఉన్న పరికరాలను సురక్షితంగా ఉంచాలి. మందులను ఉంచడానికి వసతులు లేవు. ఖరీదైన పరికరాలకు రక్షణ కావాలి. వీటికోసం భవనం, షెడ్ కేటాయించాలి. ప్రజలకు అత్యవసర స్థితిలో అందుబాటులో ఉండే ప్రాంతంలో వసతి ఏర్పాటు చేయాలి. **- సాగర్, సిబ్బంది**

షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి పైకప్పు దగ్ధం

రెబ్బెన: మండలంలోని రమణారెడ్డి నగర్‌కు చెందిన గోలేటి శ్రీనివాస్ ఇంటిలో సోమవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి పైకప్పు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి పైకప్పుకు అంటుకున్నాయి. పైకప్పుతో పాటు ఇంట్లో ఉన్న టీవీ, కూలర్, బెడ్‌లు కాలిపోయాయి. ఒక్కసారిగా దట్టమైన పొగ, మంటలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు నీళ్లు చల్లి మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ. 60 వేల వరకు ఆస్తినష్టం సంభవించిందని బాధితుడు వాపోయాడు.

దరఖాస్తుల ఆహ్వానం

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్టీ ఉద్యోగాలకు, అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు పీజీ, బీఈడీ అర్హత కలిగిన అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ఆర్. సరస్వతి సోమవారం తెలిపారు. ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు కేజీబీవీ పాఠశాల గాదిగూడలో దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

ముగిసిన లింగాష్టక పారాయణం

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక లింగాష్టక పారాయణం సోమవారంతో విజయవంతంగా ముగిసింది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899